# శ్వేత పద్మము


## WHITE LOTUS



మాస్టర్ పార్వతీకుమార్


# ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్వేత పద్మము

## WHITE LOTUS

ఆంగ్లమూలము :

**మాస్టర్ పార్వతీకుమార్**



తెలుగు అనువాదము :

**శ్రీ ఏ.యల్.యన్. రావు**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 2018 గురుపూర్ణిమ

ప్రతులు : 1,000

© ధనిష్ఠ

వెల : **రూ॥ 30-00**

*ప్రతులకు :*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.
ISBN : 978-81-89467-84-5

*ముద్రణ :*

**వంశీ కృష్ణ ప్రింటర్స్**

విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891-6617988

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి మాస్టర్ పార్వతీకుమార్‌గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో “డాక్టర్ ఆఫ్ లెటర్స్” పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, “మానవ సేవయే మాధవ సేవ” అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల

గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్య ముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# పరిచయము

సోదరులు శ్రీ కె. పార్వతీకుమార్‌గారు "ప్రాక్పశ్చిమ సమన్వయ" మనెడి మహాక్రతువులో పాల్గొనుటకు భారతదేశము నుండి వెడలి దానిని విజయవంతముగా నిర్వహించి వస్తూ యున్నారు. ఇది దీర్ఘకాలిక మహత్తర ప్రణాళిక. ఈ సందర్భముగా వారు సనాతన ఆధ్యాత్మిక తత్త్వమును పలుచోట్ల ప్రసంగములు చేయుటకద్దు. బృందజీవనము, బృందప్రజ్ఞ ఆవిర్భావము మొదలగు విషయములపై వారొసంగెడి ప్రసంగ ప్రదర్శనములు యూరోపు దేశమందలి ఆధ్యాత్మిక సోదర బృందముల వారిచే అనుభూతి పూర్వకముగా గ్రహింపబడి, ఆచరింపబడుతున్నవి.

శ్రీ పార్వతీకుమార్‌గారు తొమ్మిదవ పర్యాయము యూరోపు దేశమును పర్యటించిన సందర్భములో 'శ్వేతపద్మ' మనెడి సంకేతమును గూర్చి విశదీకరణ కొందరు కోరగా, వారి కోరికను మన్నించి, ఆ విషయమై ఆయన వివరణాత్మకమైన ప్రసంగము చేసియున్నారు.

ప్రసంగము చివరలో ఈ ప్రవచనము నంతటిని మేడమ్ హెచ్.పి. బ్లావెట్స్కీ గారికి అంకిత మొనర్ప వలయునని వారికి ప్రేరణ కలిగినది. ఆ ప్రసంగరూపమే ఈ చిన్న పొత్తము.

భవదీయుడు

31-01-2017

విశాఖపట్నం

**ఏ.యల్.యన్. రావు**

# ముందుమాట

29 సం॥ల క్రితము 'రెమ్‌షైడ్' అనే నగరములోని టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదికపై మాస్టర్ పార్వతీకుమార్ గారు చేసిన ప్రసంగము శ్రోతలను అమితముగా ఆకర్షించినది. రెమ్‌షైడ్ నగరము జర్మనీ దేశమునందలి మధ్య ప్రాంతమున నున్నది. హేమర్స్ ట్రైమ్ అనే ఒక గ్రామమునందు మాస్టరుగారు 9 రోజుల పాటు "అష్టాంగ యోగము, భగవద్గీత యందలి యోగము, మాస్టర్ సి.వి.వి. యోగము''లను సమన్వయించి జిజ్ఞాసువులకు బోధన గావించు సందర్భమున రెమ్‌షైడ్ నగరమునకు ప్రత్యేకముగ ఆహ్వానింపబడిరి. అచ్చట 'శ్వేత పద్మము'ను గూర్చి ప్రసంగించ వలసినదిగ కోరుట వలన మాస్టరుగారు సద్యో ప్రవచనము చేసిరి. అది వెనువెంటనే స్పెయిన్, జర్మనీ భాషలలోనికి అనువాదము చేయబడినది.

ఈ 'శ్వేతపద్మము' ధనిష్ఠ ప్రథమ ప్రచురణము. ఆంగ్లము, జర్మని, స్పానిష్ భాషలలో ఈ ఉపన్యాసము అత్యంత ఆదరము పొంది మరల మరల ముద్రింపబడు చున్నది.

బ్రహ్మశ్రీ ఏ.యల్.యన్. రావుగారు ఆంగ్లమున ప్రచురింప బడిన ఈ చిరు పుస్తకమును చదివి చాలా ఆనంద పడినారు. వారు దివ్యజ్ఞాన బోధనములను ఆకళింపు చేసుకొని, దివ్యజ్ఞాన సభ్యునిగ తమ జీవితమును మలచుకొని, 9 దశాబ్దములు

జీవించి, ఎందరికో దివ్యజ్ఞాన స్ఫూర్తినిచ్చిన పుణ్య పురుషులు. వారికి మాస్టర్ పార్వతీకుమార్ గారన్నచో అత్యంత గౌరవము మరియు అమిత ఆత్మీయమగు భావన యుండెడిది.

వారి దేహపరిత్యాగ అనంతరము వారి కుటుంబ సభ్యులు ఈ తెలుగు అనువాదమును ప్రచురించ వలసినదిగా మాస్టర్ పార్వతీకుమార్‌గారిని కోరగా, మాస్టరుగారు వెనువెంటనే అంగీకరించి ముద్రణమునకు ఆనతి నిచ్చినారు. తత్ఫలితముగ ఈ పుస్తకము తెనుగున సాధక సోదరులకు అందించబడు చున్నది.

'శ్వేతపద్మము' అనునది దివ్యజ్ఞాన సామాజ వ్యవస్థాపకు రాలగు మేడమ్ హెచ్. పి. బ్లావెట్‌స్కీ గారికి వారి అనుయాయులు ఏర్పరుచుకొన్న సంకేత నామము. ఈ పుస్తకము మేడమ్ బ్లావెట్‌స్కీ గారికి అంకితముగ ప్రచురింప బడుచున్నది. విశ్వవిజ్ఞాన విద్యకు నూతన శకమున తెర తొలగించి, ఆవిష్కరించిన సిద్ధురాలు మేడమ్ బ్లావెట్‌స్కీ. ఆమె స్ఫూర్తిని పొందుటకై ఈ పుస్తకమున ఆమె చిత్రపటము కూడ ముద్రించుట మాస్టర్ కుమార్‌గారి ప్రత్యేక ఆదేశము.

ఈ ప్రచురణమును బ్రహ్మశ్రీ ఏ.యల్.యన్.రావుగారి **కుటుంబ సభ్యులు** భక్తితో సమర్పణము చేసిరి.

శ్రీ విళంబి
జ్యేష్ఠ శుద్ధ విదియ

**- ధనిష్ఠ**



మేడమ్ హెచ్. పి. బ్లావెట్స్కీ

# శ్వేత పద్మము

నేటి సాయం సమయమున యిచ్చట సమావేశమైన సోదర సోదరీ బృందమునకు నా హార్ధిక సౌభ్రాతృత్వాభి వందనములు. మీ సత్సాన్నిధ్యమునకు నా ధన్యవాదములు. ఇక్కడ సమావేశమై మీ అందరితో ముచ్చటించుటకు మరొక సదవకాశమును కలిగించిన "మెర్క్యురీ స్కూలు" వారికి అనేక ధన్యవాదములు. "శ్వేత పద్మ" మనెడి నేటి ప్రసంగ విషయమునకు సోదరి ఉరుసులా కారకురాలు, ఆమెకు నా ప్రత్యేక ధన్యవాదములు.

నేటి ప్రసంగికాంశము – శ్వేత పద్మము – బహు పవిత్రమైన విషయము. కనుక మనమెంతయో వినయ విధేయతలతో ప్రసంగము లోనికి ప్రవేశించవలయును. ధ్యాన పూర్వకముగా స్మరించవలెను.

పద్మమును చూచినంతనే మనలో వర్ణనాతీతమైన పరవశత్వము కలుగును, వెలుగును. దీనికి కారణ మిదమిత్థమని వివరించజాలము. కానీ అందచందము లతో, సుగంధముతో నలరారెడి శ్వేతపద్మమును చూచి నంతనే ఉల్లాసము వెల్లివిరియును. దీనికి కారణమేమిటి అని మనమెప్పుడైనను విచారించినామా?

మనమొకింత ఆగి, తాపీగా దానివంక చూచి, పలుకరించినచో శ్వేతపద్మ మనేక రహస్యములను వివరించును. దానిని పలుకరించినచో బదులుగా నది చిరునగవులు చిందించును. పలుకరింతకు బదులుగా చిరునగవు లేమిటి? అని మీరు సంశయించవచ్చు. ప్రజ్ఞావంతులైన వారే సమాధానముగా చిరునగవులు చిలకరింతురు, కానీ ప్రవచనము చేయరు సుమండీ! చూచెడి కన్నులున్నచో శ్వేతపద్మము మనకనేక సమాధాన ముల వేజల్లులను కురిపించును. (సాదరపూర్వకమైన చిరునగవు లోలోన వెలుగొందెడి ప్రశాంతతకు, ప్రహ్లాదతకు సంకేతము) కనుకనే అది పవిత్రమైనదిగా భావించబడి, అర్చించబడుతున్నది.

లోహము లనేకము లున్నవి గదా! లోహము లన్నింటిలో కొన్నింటిని మాత్రమే మన మిష్టపడుదుము. ఇనుముకంటె బంగారము పట్లనే అప్రయత్నముగా మన మెందుకు ప్రాధాన్యతను చూపుదుము? ఇనుముకు బదులుగా వెండి బంగారములపట్లనే మనమెందుకు మెండుగా యిష్టపడుదుము? అందమైన తెల్లని గుఱ్ఱమును కాని, ఆవునుగానీ చూచినంతనే మనకెందుల కానందము కలుగును? భారతదేశములోని ఆవుల కన్నులు మీ కప్రయత్నముగా ప్రశాంతతను కలిగించును. అదీ తెల్లని ఆవు యొక్క విశిష్టత!

అందమైన తెలతెల్లని గుఱ్ఱములు, ఆవులపట్ల ఎట్లు అప్రయత్నముగా ప్రీతి కలుగునో, అట్లే అన్ని రాళ్ళకంటె వజ్ర వైడూర్యాది రాళ్ళపట్ల విలువ, ప్రీతి కలుగును. ముత్యములను, కెంపులను, స్ఫటికములను అంగడిలో అందమైన బీరువాలలో పెట్టి బీగములు (తాళములు) వేతుము కానీ బజారులోని రాళ్ళ నెందుకు అందులో పెట్టము? ఇంటిలో నింపుగా సొంపుగా పెంపొసలారెడి పూవులనే యుంచుదుము. ఏదో ఒక చెట్టు చేమ కొమ్మ

నెందులకుంచము? ఈ విధముగా మనము పరిశీలించి నచో, కొన్ని వస్తువులు మాత్రమే మన కానందమును, హాయిని ఏక కాలములో కలిగించును, వెలిగించునని విదితమగును. అట్లే మనము కొందరిని సదా ఆహ్వానించు చుండుట కద్దు. ఎందుకనగా వారి సాన్నిధ్యము ఆనందమును కలిగించి, ఉత్సాహపరుచును. వారల సాన్నిధ్యములో అప్రయత్నముగా ప్రశాంతత, సమత్వము సిద్ధించుట కద్దు.

మహాత్ముని ఆశ్రమములో చిత్త ప్రశాంతత సహజముగనే కలుగును. క్రుక్కడి మృగమైన పెద్దపులి, సాధుజంతువైన లేడి ఆ మహాత్ముని ప్రకాశ ప్రభావములో శత్రుత్వమును మరిచి, శాంతియుత సహజీవనమును సాగించును. అందులకు కారణము– ఆ మహాత్ముడు తన ప్రజ్ఞద్వారా శాంతి, సమతలను ప్రసరింప చేయుటయే. అదే విధముగా వెండి బంగారములు, విలువైన వజ్ర వైడూర్యములు, తెల్లని ఆవులు, అశ్వములు, తెలతెల్లని పావురములు, హంసలు, ఏనుగులు మొదలైనవి చైతన్య మును ప్రసరింప జేయును, వెలుగును వ్యాపింపచేయును.

దీనిని మనము "ప్రజ్ఞా ప్రభాస"మని (Light of Consciousness) అందుము.

ఎవరిలో ప్రేమాకర్షణముండునో, వారిచే మనము సహజముగా ఆకర్షించబడుట కద్దు. ఇట్లే పై నుదహరించ బడిన లోహ, వృక్ష, జంతు, మానవ వర్గములలోని కొన్నింటిచే సమాకర్షితుల మగుదుము.

ప్రజ్ఞావిలాస, విభవములకు పద్మమొక చక్కని తార్కాణము. చిక్కని చక్కని పూవుగా పూర్తిగ వికసించుటయే దానికిగల ఒకే ఒక పని. పద్మములో ఈ పూర్ణవికసనము అతి సులువుగా, సుఖకరముగా జరుగును కానీ కొన్ని కొన్ని చెట్లపూల విషయములో అట్లు కాదు. తతిమా పూలమొక్కలకు పూవులకంటె మరికొన్ని విషయము లధికము. ఉదా॥ గులాబీపూవులు. వాటి వెంటనే కంటకములు, ఆకులనేక ముండును. గులాబీచెట్టుకు గుబాళించెడి పూవుల కంటె కంటకము కలిగించెడి కంటకములు (ముళ్ళు), ఆకులధికము గదా! అనగా అముఖ్యములైనవి అధికము, ముఖ్యములైనవి అల్పము!

సాధారణముగా మానవునకు సైతము ముఖ్యములైనవి కొన్నియే యుండును. కానీ అముఖ్యములైనవి అనేకానేకము లుండును. ఒక మహాత్ముడిని పరికించినచో, వానికి ముఖ్యములైనవి మాత్రమే యుండును. అముఖ్యము లుండనే యుండవు.

ఎక్కువ పూల నిచ్చెడి మహావృక్షములు కొన్ని యున్నవి. కానీ వాటి విషయములో ఒక చిక్కు వున్నది. మొలక మొక్కయై అది పెద్దది కావలయును, అటుపై కొమ్మ లేర్పడవలెను. ఆ కొమ్మలకు కొమ్మలు, వాటికి ఆకులు, నునురెమ్మ లేర్పడవలెను. కానీ పూవులు మాత్రము కొద్దియే! ఇది గమనించారా?

ఇట్లే అలవాట్లు, ఆచారములు, మర్యాదలు అనేకములు కానీ ప్రధానమైనది కొలది మాత్రమే. కనుక మానవుని ప్రవృత్తికి, ప్రకృతికి వృక్షమొక చక్కని ప్రతీక.

మనముకూడా ముఖ్యమైన వాటిలోకంటె కల్పించు కున్న మన్ననలు, మర్యాదలలో నెక్కువగా జీవింతుము. ఈ స్వయంకృత మర్యాదలలో నెంత తలమునక లవుద

మనగా– అసలు ముఖ్యమైన వాటిపట్ల యెఱుక యుండనే యుండకపోనంతగా తలమునక లగుదుము. అనవసరపు ప్రసంగములు, అటు యిటూ తిరుగులాటలు, వేటికో వెంపరలాటలు, వేవేల పనులు. ఈ అన్నింటిలో ఆణిముత్యము లాంటివి ఒకటియో మహా అయితే రెండో వుండవచ్చు.

మీరు పద్మమును పరికించినచో, దాని పరిస్థితియే వేరని విదితమగును. దానికి అముఖ్యము లనెడివి ఏమియూ లేవు. పరిపూర్ణముగ వికసించి సౌరభ సౌందర్యములను ప్రసరింప చేయుటయే దాని ఏకైక కార్యము. దాని దళముల సౌకుమార్యము, సౌందర్యము, వాటి వికసనము, ప్రసరణము వినా మరేమియూ దానికి లేవు గదా! పద్మమునకు మూలమైన నాళమును కనిపింప చేయదు. గమనించారా?

దాని నాళము దాని వ్యక్తిత్వము, కాని దానిని అది కనిపించనీయదు. అనగా ముఖ్యమైన దానినే ప్రదర్శించును గాని అముఖ్యములైన వాటిని తెలుపదు,

కనుపించనీయదు. పరస్పర కార్యకలాపములలో ముఖ్యమైన విషయములనే ముచ్చటించుకో వలయును గానీ అముఖ్యమైన వాటిని సుతరామూ దగ్గరకు రానీయ కూడదనెడి చక్కని సందేశమును పద్మము మానవులకు ప్రబోధించు చున్నది. సర్వకాల సర్వావస్థలలో సదా ప్రేమ ప్రకాశములను మాత్రమే ప్రసరింపచేసినచో, సదా చిరునగవులనే చిందించినచో, మనము పద్మములుగా పరిగణింప బడుదుము. కానీ దురవస్థ ఏమిటి అనగా ప్రేమ ప్రభాసములను తప్ప తతిమా అన్నింటికీ అనగా అనవసరములైన వాటిని ప్రకటించుదుము, ప్రదర్శింతుము. సగటు మనిషి అనావశ్యకములు, అవాంఛనీయములైన వాటిని అసభ్యముగా ప్రదర్శించు చున్నాడు. కనుక పద్మమొక దివ్య సందేశమును వినిపించుతున్నది.

**"మీలో నందముగా, వెలుగుగా, మార్ధవముగా వికసనమై యున్న దానిని ప్రదర్శించండి. ఆ ప్రదర్శన ప్రశాంతముగా, నిశ్శబ్దముగా, నిగూఢముగా నుండవలెను."**

శ్వేతపద్మము వంకగానీ, కనీసము దాని పటము

వంకగానీ పరిశీలనాత్మకముగా పరికించినచో, అది అనేక దివ్య సందేశముల నందచేయును.

పద్మము మూడు లోకము లందుండును. దాని మూలము (వేళ్ళు) బురదలో, నాళము నీటిలో, పూవు నీటిపై తేలియాడు చుండును. అది ముమ్మూర్తులా మానవునివలె నుండును. మనము ద్రవ్య, శక్తి, ప్రజ్ఞా లోకములలో (Matter, Force, Consciousness) నున్నాము. కనుక మనకు, పద్మమునకొక సాదృశ్య మున్నది. పద్మము కంఠము వరకు నీటిలో నుండును; కానీ తన సౌందర్య సౌకుమార్యముల నందరికీ ప్రదర్శించును. మనము గొంతువరకు ఇక్కట్టులలో కూరు కున్నచో, పద్మమువలె ప్రవర్తించ గలమా? ఆలోచించండి. మనకది ఎంత అసాధ్యమో!

మీరు జ్ఞానవంతులు, సౌమ్యవంతులు కాగోరినచో; ఏకత్వమును, ప్రేమను ప్రసరింపచేయ గోరినచో, పద్మమొక పసందైన ఉపదేశము నిచ్చును. అది:

**"నన్ను గమనించితిరా! నేను కంఠము వరకూ నీటిలోనే**

**యున్నాను, కానీ చిరునగవును చిందించు చున్నాను, వికసించుచునే యున్నాను. ఆటుపోటులు గల నీటిలో నేను గొంతు వరకు వున్నప్పటికీ, మీకు హాయిని చేకూర్చుటయే నా కర్తవ్యము.”**

మూడు కక్ష్యలలో నున్న పద్మము మూడు కక్ష్యలలో నున్న మానవుడిని పోలి యుండును. దానికి ఉన్నత కక్ష్యల నుండగల్గెడి సామర్థ్య ముండిననూ, నేలపట్టును మాత్రము వదలదు, విడువదు. మనము ప్రజ్ఞరీత్యా ఉన్నత కక్ష్యలలో నున్నాము కనుక మరిక నేలను వీడవచ్చునని భావించ రాదు (అనగా స్థితి మారినది కనుక పూర్వపు స్థితిని, గతిని మరువరాదు). నేలపై పుట్టి పెరిగి నేలను విడువకుండుట అనగా లోకములో ఆచరణాత్మక బుద్ధిని కలిగి యుండు టయే (పై స్థితిలోనికి చేరుచున్నకొలదీ మన క్రింద వాటిని మరువకూడదు).

ఆధ్యాత్మికసాధన చేయు వారిలో అనేకులు ఉత్తమ స్థితికై వెంపరలాడుచూ, నెలవైన నేలను మరచుట కద్దు. నెలవైన నేలనే విడిచినచో పడుట తప్పదు. అట్లు పడుట యితరులపై పడుటయే కదా! ఆధ్యాత్మిక సాధన అనెడి

పేరుతో కొందరు యితరులపై పడుట కద్దు. దినదినము (ఇతరులపై) ఆధారపడినచో అది ఆధ్యాత్మిక సాధన కాదు. (ఆధ్యాత్మిక సాధనలో తనపై తాను ఆధార పడవలయును. ఇతరులకు ఆధారభూతముగా నుండవలయును. దీనినే ధీరత అని, ధీశక్తి అని అందురు.).

పద్మములతో పరిఢవిల్లెడి కొలను నుండి ఒక పద్మమును పెకలించినచో ఏమి జరుగును? మరుక్షణ ములో పద్మము యొక్క సహజమైన వన్నె తరుగును. అదే విధముగా ఆచరణ లేక పరులపై ఆధారపడిన సాధకుని శోభ శోషిల్లును. తాను సాధన చేయుచున్నానని అతడు భావించవచ్చు; కానీ నిజమున కతడు పతనమగు చున్నాడని తెలియదు. నేల విడిచి సాధన నేల విడిచిన సాము. ఇందు క్షీణత శీఘ్రతర మగును. పద్మమును పదిలముగా పరిశీలించినచో, అది అందచేయు దివ్య సందేశ మిది.

ఆటుపోటులు వచ్చిననూ మూలమైన నేలను వదలదు. ఇదొక సత్సందేశము. గొంతు వరకు చింతలు, వంతలు, సిలుగు లుండిననూ, వాటిని అది బహిర్గతము

చేయదు (ఇది మనో నిబ్బరము). ఇది మరియొక పసందైన సందేశము. బురదలో నుండినప్పటికీ, సమస్య లతో సతమత మగుతున్నప్పటికీ, తనలోని సల్లక్షణములనే చూపును.

బురదలో పుట్టి, అందులోనే పెరిగిననూ, పద్మము ప్రజ్ఞగానే నిలబడును. కనుకనే యోగికి సముచితమైన ఉదాహరణము- పద్మము. అది భౌతికతను, ప్రజ్ఞను సమతుల్యముగా నుంచి, సదా యోగత్వ స్థితిలో నుండును *(సమత్వం యోగముచ్యతే).* కనుకనే (కేవలము) భౌతికముగా కానీ, ప్రజ్ఞాపూర్వకముగా నుండుట కంటె యోగిగా నుండుట మిన్న అని శాస్త్రము లుద్ఘోషించు చున్నవి. భౌతికతకు, ప్రజ్ఞకు యోగి సమాన దూరములో నుండును. ఇట్లు సమాన దూరములో నుండుటవలన యోగి భౌతికతను, ప్రజ్ఞను అతి సునాయాసముగా, సరియగు రీతిలో, సదా సమతుల్య స్థితిలో నుంచును. పద్మమీ గుణపాఠము నుద్ఘాటించును.

జీవితములో మార్దవముగా ప్రవర్తించుట ప్రశస్త్య మని పద్మము మరియొక చక్కని పాఠమును బోధించును.

పద్మ దళము లెంత మృదువుగా నుండునో గమనించండి. అట్టి మృదుత్వము మనలో నున్నదా? ఈ ప్రశ్నను వేరొకరికి కాక తనకు తానే వేసుకొన వలయును.

మనము పద్మమును సమీపించునప్పుడు, స్పృశించు నప్పుడు అతి జాగరూకతతో, మార్దవముతో ప్రవర్తింతుము. ఇతరులను సమీపించు నప్పుడుగాని, వారితో వ్యవహ రించునప్పుడు గాని అట్టి మృదుత్వమును, జాగరూకతను పాటింతుమా? అన్ని విషయములందు, అన్ని వస్తువులపట్ల అట్టి మార్దవమునే కలిగి యుండమని పద్మము కమనీయ పాఠమును గరుపుచున్నది. సాధారణముగ మన కారు, యింటి తలుపులపట్ల ఎంతో జాగ్రత్తగా వ్యవహరింతుము. అట్టి మార్దవమునే ఇతరుల కారుల పట్ల, తలుపులపట్ల చూపించ వలయును. ఇక్కడ కారు, ఇంటి తలుపు అనునవి సంకేత పదములని గమనించండి. మీరు మీ నోరు అనెడి తలుపు ద్వారా మాట్లాడగా, అది చెవి అనెడి తలుపు ద్వారా కర్కశముగా వినిపించరాదు, అనిపించ రాదు. అనగా మన పలుకులు, చేతలు, చూపులు మృదు మృదులముగా నుండవలెను. ఇందులకు పద్మమును

పరిశీలనగా చూచి, అది మన కేమి సూచించుచున్నదో అవగాహనమైనచో అంతటి మృదుత్వము సుసాధ్య మగును.

తాజాతనము పద్మము యొక్క మరియొక సల్లక్షణము. దినములో కొద్ది గంటలు మాత్రమే మనము తాజాగా నుండగలము. ఆ కొద్దిపాటి కాలములో తాజాగా నుండు టయే మహా గగన మగుతున్నది. సదా తాజాగా, హాయిగా నుండమని పద్మము మనకు చక్కని సందేశ మిచ్చుచున్నది. హాయిగా తాజాగా నుండుట, అట్లుండుటలో గల ఆనందమును పద్మము సూచించు చున్నది.

కట్టెదుట పద్మము వుండనప్పటికీ, దానిని గురించి ఆలోచించు చుండగా అనేకానేక వెలుగుల తలపులు స్ఫురించును. అదీ పద్మము యొక్క ఘనత! అది మహా జ్ఞాని. మహా జ్ఞానిని తలచినంతనే మీలో వికసనము కలుగును. పంచభూతములపై స్వామిత్వము సాధించిన మహాత్ముడిని తలచినంతనే వారి సాన్నిధ్యము సంలభ్య మైనట్లు, పద్మమును గూర్చి ఆలోచించి నంతనే దాని

సాన్నిధ్యము సంప్రాప్తమగును. అందువలన ధ్యాన చిహ్నముగా పద్మము నిర్దేశించబడినది.

మానవుడిని మాధవుడిగా ధ్యానించుటకు మన కభ్యంతరము లున్నచో, ప్రత్యామ్నాయముగా పద్మమును గ్రహించ వచ్చును. పద్మమును తలచినంతనే వెలుగుతో నేరుగా మీకు సంబంధము కలుగును. దానిని ధ్యానించగా, తెలతెల్లని వెలుగుగా ప్రజ్ఞ ప్రభాసించును. ఆధ్యాత్మిక సాధన వలనగానీ, ధ్యాన ప్రక్రియ ద్వారాగాని ఆ తెలతెల్లని వెలుగునే ధ్యానించుదుము; సందర్శించ కోరుదుము. మీ భ్రూమధ్య స్థానమందు (అనగా రెండుకన్నుల మధ్య) పద్మమును భావించినంతనే వెలుగు వ్యక్తమగును.

జీవితములో ఆనందముగా నర్తించుట, వర్తించుట యెట్లో పద్మము వివరించును. కొలనులో కోకొల్లలుగా అలలు ఎగసి ఎగసి పడుతుండగా, పద్మము ఆ ఆటుపోట్లకు లయబద్ధముగా అనునట్లు తల నూపుచు, ఈ జీవితములో ఎన్ని చిక్కులు, చీకాకు లుండిననూ, ఆనంద వర్తనమే ముఖ్యమనెడి సందేశమును వినిపించుతున్నది.

ఇది గమనించారా? కనుక, కినుక వహించక, జీవితము నౌక ఖేలగా హేలగా లీలగా వర్తించవచ్చు, నర్తించవచ్చు.

క్రమశః వికసించు పద్మములో నొక సుందర సందేశ మున్నది. పద్మ వికాసము లోనుండి వెలుపలికి అగును. పద్మపు మొగ్గ మెలమెల్లగా వికసించుట నారంభించును. (దీనినే పెద్దలు In-forming అని అందురు. అనగా లోలోన (in) రూపాంతర మగుట (forming). వికసనమునకు వెలుపల నంతగా వెతికి, చూడ నవసరము లేదు. వికసించవలయు ననెడి సంకల్పము కలిగినచో, అదియే మనలో వికాసమును కలిగించును, వెలిగించును. పద్మమేమి సలహా యిచ్చు చున్నదో చెవి యొగ్గి వినండి.

**"మీ (బుద్ధి) వికాసమునకై అటు యిటు పరుగులెత్త పని లేదు. నిలకడగా (మీరున్న చోటుననే) నిలబడి (లోలోన) విచారించండి. మీ వికాసమునకై సవ్యమైన నిర్దేశ్యము, యుద్దేశ్యము వెలుగును."**

ప్రజ్ఞా వికసనమునకై హిమాలయములకు గానీ,

తత్సోదరీతుల్యమైన ఆల్ప్స్ పర్వతములకు గానీ పరుగులు తీయనక్కర లేదు. మీరుండిన చోటనే యుండండి. ఎందుకనగా ప్రకృతి మీ కచ్చోట నుండియే వికసనము కలిగించ నిచ్ఛగించు చున్నదని గ్రహించండి. ఇచ్చోటు కాదని అచ్చోటుకు, అదీ కాదని వేరొక చోటుకు మారిననూ, మనము మారము గదా! తావులు మారవచ్చు కానీ మన మనస్సులో మార్పు(రా)లేదు కనుక మనము "మనము"గానే యుందుము. మనస్సు నింట వదిలి, హిమాలయములకు వెడలలేము. మన మెక్కడికి వెడలి నను, మన మనోప్రవృత్తి మారదు. కనుక "ఎందుల కటూ యిటూ ఉరుకులు, పరుగులు? నిలకడగా నిలబడండి. నింపాదిగా నిలుచున్నచో మీరున్న తావునకే అన్నియూ వచ్చును" అని పద్మము చెప్పుచున్నది.

ఇది వినదగిన విలువైన విషయము కదా! మనము పద్మములమే కనుక ఈ ప్రతి సందేశమును సద్గ్రంథముగా వికసింప చేయగలము కదా!

పద్మము క్రమశః ఎట్లు వికసించుచున్నదో పరిశీలిం చండి. ఒక్కసారి మొగ్గలోని రేకులు విడివడుట మొదలైనచో

మరి వెనుదిరిగి చూచుట యుండదు. ఈ వికసన మభివృద్ధి ముఖముగా కొనసాగుచునే యుండును. కానీ ఒక్క నిముషమైననూ ఆగదు. పద్మ వికసనమునకు పండుగలు, పర్వదినములు, వారాంతపు సెలవు దినములు, వేసవి సెలవులు– ఇత్యాదులేమియూ యుండవు. మనకొక పనికి మరొక పనికి మధ్య వీలైనంత విశ్రాంతి అవసరము, పద్మమునకా అవసరముండదు. పద్మము యొక్క క్రమోన్మీలనము లేక వికసనము– సహజ ప్రక్రియయే అని భావించ వలయును.

సూర్యకిరణమునకు పద్మమునకు గల సంబంధమే దాని క్రమ వికాసమునకు కారణము. సూర్యకిరణమున కెంతగా పద్మము ప్రభావితమగునో గమనించండి. అది సంపూర్తిగా సూర్యకిరణ ప్రభావితమగుట వలన, అందులో రకరకముల రంగుల మేళవింపు లేదు; నలుపు రంగు నలుసుగా నైననూ లేదు. వెలుగునకు వెరువక, సదా వెలుగువైపునకే ముఖము త్రిప్పవలయును. ఇది పద్మ మిచ్చెడి సందేశము. వెలుగు వైపునకే తిరిగినచో

ప్రయోజన మేమిటి- అనెడి ప్రశ్న కలుగవచ్చు. దీనికి ప్రత్యుత్తరముగా పద్మమే యిట్లు చెప్పును.

**"నన్ను చూచితిరి గదా! నాకేమి జరుగుచున్నదో మీకూ అదియే జరుగును; కలుగును."**

దానికి జరుగుచున్నది క్రమ క్రమమైన వికసన ప్రక్రియ. మనము సూర్యుని వెలుగునుండి మరలినచో, జీవితములో నీడ లల్లుకొనును. మీ నీడ నెప్పుడు మీరు చూడగలరు? మీరు సూర్యునికిగాని, వెలుగునకు గానీ వెన్ను చూపినచో నీడ ఏర్పడును.

మనము వెలుగునుండి మరలినచో మన నీడ మన కగుపించును. వెలుగునుండి మరలుచూ పొడవైన నీడను చూచి, దానిని పట్టుకొని మనలో నిముడ్చుకోవలయునని అనుకుందుము. ఆ నీడను పట్టుకొనుటకై దాని వెంట పరుగు లెత్తుదుము. మనమెంతగా పరుగు లెత్తుదుమో, అంతగా నీడ మనకంటె ముందుకు సాగును; సాగుచూ, సాగుచూ అది ఎంతో పొడు గగును. ఆ నీడను పట్టు కొనుటకు మనము విసిగి వేసారుదుము. తమ వ్యక్తిత్వము వెంట పరుగులిడు వారి గతి యిట్లే అగును.

మనము సామాన్యముగా నుండుటకంటె అధికముగా నుండగోరుతాము. దీనిని అసాధారణము లేక అసమాన్యము (Abnormal) అని అందురు. చివరకు సాధారణ స్థితి కంటె అతిగా యుండి, అసాధారణ స్థితిలోనికి తేలుదుము. అందరివలె గాక మనలో ఒక ప్రత్యేకత యున్నదని భావించి, భ్రమించి, ఆ ప్రత్యేకతను ప్రదర్శించుటకు వివిధ ప్రయత్నములు చేతుము. అప్పుడు సామాన్య మానవులు “వీడేదో అతిగా నున్నాడు. వాడిని గురించి మనము పట్టించుకోరాదు. వీడి కేదో తల తిరుగుడు ఉన్నట్లున్నదని” అనుకొనుట కద్దు. తామేదో ప్రత్యేకత కలవార మనెడి ప్రతీతి కలుగవలయునని ఆశించెడి వారి కర్మ ఇది!

మహాత్ములు, పరమగురువులు లేక మాస్టర్లుగా మనకు తెలిసిన వారందరూ సామాన్య మానవులుగనే యుందురు గానీ “మేము మాస్టర్లము” అనెడి భావనను కలుగనీయరు. ఎవరికి ప్రజ్ఞాదృష్టి కలదో వారు సామాన్యుల మధ్య సామాన్యముగా సంచరించు మాస్టర్లను సందర్శించగలరు. అసామాన్యులలో, అసాధారణ ప్రదేశములలో మాస్టర్లకై సదా శోధించుట కద్దు. కానీ

అసామాన్యులతో, అసాధారణ ప్రదేశములతో వారి కేమియూ పనిలేదు. కనుకనే మాస్టర్లు ప్రతి పర్యాయము వచ్చునప్పుడు ప్రజలు వారిని చూడజాలక పోతున్నారు. కారణమేమిటి? ప్రజలకు పటాటోపములు, భేషజముల పట్ల ప్రీతి యుండును గానీ నిరాడంబరత్వము పట్ల కాదు.

మనము సాదా సీదాగా నున్నచో హాయిగా నుందుము. నిరాడంబరముగా నున్నచో మనము సమత్వ స్థితిలో యున్నట్లే! కానీ నిరాడంబరముగా నుండుట మనకు కష్టమైన పని. (కొండొకచో కొందరి కిష్టముగాని విషయము.) హాయిగా నుండుట చాలా తేలిక, సామాన్యము. కానీ సామాన్యముగా నుండుట కిష్టముండదు కనుక అది కష్టమైన విషయము. ఇది జీవితములో మనకొక పెద్ద సవాలు!

కనుక మనము పద్మము నుండి నేర్చుకోవలసినది– సాదా సీదాగా నుండు వారి మధ్య సాదాగానే యుండుట, మితము తప్పకుండుట, (వ్యక్తిత్వమనెడి) నీడల ప్రత్యేకతకై పరుగులు తీయకుండుట. నీడను పట్టుటకై పరుగులెంత

తీయుదుమో, అంతగా నలసి సొలసి పోదుముగానీ నీడను పొదివి పట్టలేము.

వ్యక్తిగతముగా కానీ, సామూహికముగా కానీ, దేశరీత్యా కానీ, జాతిరీత్యా కానీ మరొకరికంటె మనమే అధికుల మనుకొందుము. కానీ పతన మిక్కడనే! తామే అధికులమని అహంకరించిన జాతులు, వర్గములు, బృంద ములు, మతములు, తెగలు కుప్పకూలవలసి వచ్చినది. తమ ప్రత్యేకతను చాటించుకొను కారణముగా వీరెట్లు పతనమగు చున్నారో ప్రతిదినము మనము చూచు చున్నదే!

ప్రత్యేకతకై వెంపరలాడుట, నీడ వెంట పరుగు లెత్తుటయే. అది ఒక భ్రమ. వాటి వెంట పరుగెత్తుట నిష్ఫలము. కనుక ఏదో ఒక చోట ఒకనాడు మనిషి అలసి సొలసి పోవును; ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అగును. కానీ విచిత్రమేమిటి అనగా- ఉక్కిరి బిక్కిరి అవుతూనే వాటి వెంట పరుగులు తీయును! పరుగులెత్తి చివరకు పడి పోవును. అట్లు పడిపోయిన వానిని ఒకరు వచ్చి "ఎందుకు నాయనా! పిచ్చివానివలె ఇలా పరుగులెత్తు తున్నావ"ని

ప్రశ్నించును. అందులకాతను వగర్చుచూ "నా నీడను పట్టుకొనుటకండీ బాబూ! ఈ పరుగులు" అని మరల పరుగెత్తబోవును. "అదా సంగతి! వెఱ్ఱి నాయనా! ఎందుకురా ఇన్ని వెతలు? నీవు వెలుగు వైపు సాగినచో నీ నీడ నిన్ను పట్టుకొనుటకు నీ వెంటపడి వచ్చును గదా! నీ నీడకై నీవు ఉరుకులు పరుగులు తీసి ఉక్కిరి బిక్కిరి అగుటకంటె– ఈ సూచన మంచిది కదా! ఇది పాటించితే నీ నీడ నిన్ను వెన్నాడును కదా" అని చక్కని యోచన యిచ్చును. మరిక ఆలస్య మెందుకు? అదిగో అది తూర్పు దిశ, పరుగుదీసి చూడు అని సలహా యిచ్చును. ఇప్పుడొక శంక కలుగుట సహజము. "అనగా నన్ను వెనుకకు పరుగెత్తమని మీ యుద్దేశ్యమా?", "అయ్యా! మీరు వెనకకుగాని, క్రింది, పైకి గానీ పరుగెత్త పని లేదు. వెలుగు దిశయైన తూర్పు వంక పరుగెత్తండి. పరిష్కారము కలుగును." సరే ప్రయత్నించుదుము గాక అని తలచి వెలుగు దిశయైన తూర్పు వైపునకు పది అడుగులు వేతుము. సందేహముతో వెనుకకు తిరిగి చూడగా, అరే! మన నీడ మన వెను వెంటనే వచ్చుచున్నట్లు

గమనించుదుము. సరే పరుగులు దీసి వెనుక వైపు పరికించాము. మన నీడ మనకంటె చాలా వెనుక నున్నది.

మనము ఆత్మ స్వరూపులము; ఆత్మప్రజ్ఞతో ప్రవర్తించినచో, వ్యక్తిత్వ జీవితము మనల ననుసరించును. ఇదిగో ఈ చక్కని సందేశమును పద్మమెట్లు వివరించు చున్నదో వినండి.

**"మీరు (నావలె) సదా సూర్య కిరణములవైపు తిరగండి. అంతయూ దివ్యముగా నుండును."**

సూర్యాభిముఖులమై యున్నంతకాలము మీకెట్టి యిక్కట్టు లుండవు. కనుకనే జ్ఞానులైన మహాత్ములకు బాధలనెడివి యుండవు. కారణమేమిటి? మీరు ఆత్మ ప్రజ్ఞ (అది సూర్య ప్రజ్ఞకు మీలో గల చిహ్నము) నుండి మరలినప్పుడు వ్యథలు, వేదనలు కలుగును. అదీ కారణము.

జ్ఞానులకు చీకటి యుండదు. వెలుగులో మీరుండగా (మీలో వెలుగు నిండగా) చీకటి యెట్లుండును? "చీకటి ఏది?" అని వెలుగుల వేలుపు సూర్యుడిని అడిగినచో, మరి

కొంత వెలుగును విరజిమ్మును. మరిక చీకటి అనెడి ప్రసక్తి లేదు. ప్రశ్న లేదు. వెలుగు వెలుగును; వెలిగించును. ఫలితముగా చీకటి యుండనే యుండదు.

జ్ఞాని పూర్తిగా వెలుగు వైపునకే యుండును. వానికి చీకటి యుండదు. వాని ముఖము సూర్యాభిముఖమై వెలుగు చుండును. కనుక దానిచుట్టూ అనేకులు గుమి గూడుదురు. వానిచుట్టూ చేరిన వారందరూ ఒకే ఒక విషయము గూర్చి మాట్లాడుదురు. అది చీకటి గురించి. కరుణార్ద్రుడైన ఆ జ్ఞాని సుదీప్తవంతమైన చిరునగవుతో చీకటి గురించి ఛీత్కరించు వారల నందరినీ వెలుగు వైపు మరల్చును. ఫలితముగా వారలలో చీకటిని గూర్చిన చింతనమే యుండదు. కొద్దిరోజులైన తరువాత ఆ జ్ఞానిని "నేను చీకటినే చింతనము చేసెడివాడను, మరిప్పుడది లేనే లేదు. ఎక్కడకు మటుమాయమైనదా చీకటి" అని ప్రశ్నించును. అటుపై మరికొన్ని దినములకు ఆ జ్ఞానినే "స్వామీ! ఇంతటి కాంతి యుండగా ఎందులకీ జనులు చీకటిని గూర్చి చింతించు చున్నారని" ప్రశ్నించును.

గమనించారా? ఈ ప్రశ్న వేసినవాడు తన జీవితములోని చీకటి దినములను మరచిపోయినాడు!

వెలుగువైపు తిరిగిన వాని స్మృతి నుండి చీకటి తొలగిపోవును. మనలను వెలుగువైపు మరల్చుటయే కాదు, వెలిగించును. కనుక ఇదొక కమనీయ సందేశము. వెలుగుల వేల్పుతో చెలిమి పెంచుకొనిన (వెలిగించుకొనిన) పద్మము గూర్చి కదా మనము ప్రస్తావించు చున్నాము.

"కంఠము వరకూ నీటిలో యుంటివి కదా! నీకు చల్లగా లేదా? చలి వేయదా? జలుబు చేయదా?" అని పద్మమును ప్రశ్నించితే ప్రత్యుత్తరముగా నది ఏమను చున్నదో గమనించండి.

"నాకా స్పృహయే లేదు. అది పోయి చాలా కాలమైనది. ఆ సూర్యకిరణముల సురుచిరత్వమే నాకు తెలుసు. వాటికే నేను జీవించుచున్నాను. చలి, జలుబు ప్రసక్తి యెలా వచ్చినది. నాకు లేని వాటిని గూర్చి మరల మరల గురుతు చేయకండి."

మనకు చలిగా నున్నచో, వేడి కలిగించు ఉడుపుల

నితరుల కివ్వవలయునని అనుకొనుట సహజము. అట్టి దుస్తులు నిజముగా నవసరమైనచో అతడే వాటికై ప్రయత్నించును, లేకపోతే స్వయముగా నడుగును. మనకు చలి బాగా నున్నప్పుడు, "మీకు చలిగా నున్నది కదూ" అని అందుము. ఎదుటివాడు వివేకవంతుడైనచో ఈ అడిగిన వానికే అతి చలిగా నున్నదనెడి సంగతి వానికి అర్థ మగును.

ఈ సందర్భములో సంబంధిత కథ నొక దానిని ముచ్చటించుట సముచితముగా నుండును. పూర్వ కాలములో అష్టావక్రుడనెడి ఆధ్యాత్మికవేత్త ఒకరున్నారు. సమాజములో ప్రసిద్ధి గాంచినవా డతడు. జనక మహారాజు అనెడి ఆధ్యాత్మికవేత్తతో కొన్ని ఆధ్యాత్మిక విషయములను ముచ్చటించుదామనెడి అభిలాషతో ఆ మహారాజు గారి వద్దకు వెడలినాడు. జనక మహారాజు ఆధ్యాత్మ ఆచరణాత్మకుడే కానీ కేవలము ఆధ్యాత్మికాభిలాషి కాడు, కుతూహలుడూ కాడు. అదియూగాక, వారు నిర్వహించ వలసిన బాధ్యతలు, ధర్మము లనేకమున్నవి.

బాధ్యతలు, ఆచరణశీలత లేని ఆధ్యాత్మికుడు,

ఆధ్యాత్మికతను గురించి ముచ్చటించుట కిష్టపడును. బరువు బాధ్యతలు తెలిసిన సాధకుడు కాలమును వృథా చేయడు; అర్ధరాత్రి వరకు వేదాంతములో అచ్చట్లు ముచ్చట్లు చెప్పుకొనుట కిచ్చగించడు; వానికి వీలు పడదు.

మరిక కథ లోనికి ప్రవేశించుదాము. కర్తవ్య నిర్వహణ, బాధ్యతలు నెరింగిన జనక మహారాజు అష్టావక్రునితో ఆధ్యాత్మిక ప్రసంగమునకై సమయమును కేటాయించలేదు. కానీ అష్టావక్రుడు మాత్రము తిష్ఠవేసి ఆధ్యాత్మిక కాలక్షేపము కలుగ చేయమని మరీ మరీ అభ్యర్థించాడు. విషయమును గ్రహించిన మంత్రులు "మహారాజా! అష్టావక్ర మునిని తమరు వారము దినము లుపేక్షించారు. ఇంకనూ ఉపేక్షించుట ఉచితము కాదు. తమ సందర్శనార్థమై వచ్చినవారిపట్ల సైతము శ్రద్ధ వహించుట మీ ధర్మములోని భాగమే కదా!" అని మనవి చేశారు. అందులకు చిరునగవుతో సమ్మతించిన జనక మహారాజు అష్టావక్రునికి తగిన అవకాశ మనుగ్రహించారు. అదనుకై వేచియున్న అష్టావక్రుడు "మీరు నిద్రలేక నుండ గలరా?"; "అన్నోదకములు లేకుండా నుండ గలరా?";

"ఈ సకల రాజభోగములు, సంపదలు, సదుపాయములు లేకుండా కూడా నుండగలరా".... ఇలా వివిధ ప్రశ్నల పరంపరను మహారాజుపై సంధించాడు. పసలేని ఈ ప్రశ్నల పట్ల రాజుగారంత ఆసక్తి ప్రదర్శించ లేదు, జవాబులు చెప్పలేదు. రాజుగారి కిష్టము లేక జవాబులు చెప్పలేదని అష్టావక్రు డసంతృప్తిపడి, వారిని గూర్చి తన యిచ్ఛ వచ్చినట్లు భావించుకున్నాడు. సమృద్ధమైన మహారాజ భోగ భాగ్యములతో విలసిల్లుతూ ఈ జనకుడు ఆధ్యాత్మిక సాధనను కోల్పోయినాడని, కనుకనే తగిన జవాబులు ఇవ్వలేదని నిశ్చయించుకున్నాడు. పెదవి విప్పని ఆ పృథివీపతి తనను గూర్చి యిచ్ఛవచ్చినట్లు తల పోయుటకా సాధక పుంగవునికి తగిన అవకాశ మిచ్చాడు.

ఒకనాడు మహారాజు తన మంత్రులను పిలచి, "ఈ సాధకునితో కొంతకాలము సహవాసము చేయుటకు నిశ్చయించు కున్నాను కనుక ఒక వారము దినముల పాటు రాజ్యభారము, బాధ్యత, భద్రత వహించండి" అని ముదలకించాడు. ఆ తరువాత ఆ అహంకార సాధకుడిని సమీపించి, "మీ రడిగిన ప్రశ్న లన్నింటికీ చేతల ద్వారా

ప్రత్యుత్తర మివ్వదలచితిని; అందులకై వారము దినము లీ రాజ్యభారమును మంత్రుల కప్పగించి వచ్చితిని. మీరడుగ దలచిన ప్రశ్న లన్నింటినీ నిస్సంకోచముగా నడగండి. చేతల ద్వారా జవాబులు చెప్పగలనని" అన్నాడు. అందుల కానందించిన అష్టావక్రుడు "మహారాజా! మన మడవుల లోనికి పోదాము రండి" అన్నాడు.

సాధన కాండ నంతటినీ అరణ్యములలోనే సాగించుట సాధ్యము- అంతేకాని ఈ జనసందోహముల మధ్య, సమస్యల తోరణముల మధ్య, జీవన సన్నివేశములు, సంఘర్షణల మధ్య సాధన సాధ్యము కాదనెడి విచిత్ర విశ్వాస మిప్పటికినీ వెల్లివిరుస్తున్నది. మనలో చాలామంది అనుకూల వాతావరణములోనే ఆధ్యాత్మికులము! మన పరిసరములలో నన్నియు సవ్యముగా దివ్యముగా నున్నచో, సమస్యలు, సంఘర్షణలు, ప్రతికూల సన్నివేశములు లేనిచో కాలక్షేపమున కన్నట్లుగా ఆధ్యాత్మిక చింతన చేయుట కద్దు. సమస్యలున్నచో సాధననుగానీ, ఆధ్యాత్మిక చింతనమును గాని పట్టించుకొనము. కారణము సాధన

కంటె సమస్యలే ముఖ్యము! అట్టి సమయములలో నెవరైనా మనలను "సాధన బాగా సాగుతున్నదా?" అని ప్రశ్నించితే "సాధన ఏమిటి స్వామీ! సమస్యలతో తల మునకలై చస్తుంటే, సమస్యల పరిష్కారమునకే సమయము సరిపోకపోతున్నదే, మరి సాధన ఏమంటుందండీ?" అని సమర్థించుకోవటము సహజము. అయ్యా! ఇదీ సంగతి! అన్నియూ అనుకూలముగా నున్నచో "ధ్యానము చేసినచో మానసిక శాంతి యుండును; సమస్య లుండవు" అని అతి యుదారబుద్ధితో నుచిత సలహాల నిచ్చు చుందుము. ధ్యానము, తత్ప్రక్రియలు, ప్రయోజనముల గురించి గంటల తరబడి, సంపుటముల కొలది, సుదీర్ఘోపన్యాసము లిత్తుము. ఆపత్తులు విపత్తులు చుట్టుముట్టినప్పుడు సాధనను తీవ్రతరము చేయవలయునని దీర్ఘోపన్యాసముల నిత్తుము. ఇది ఇతరులకు చెప్పుట వరకే పరిమితము; మన విషయములో ఆచరించము.

అందుకనే ఆరణ్యములోనికి వెడలి (అక్కడ సదుపాయము లుండవు కదా!) అక్కడ ఆధ్యాత్మికత

గురించి ఆలోచించుదా మన్నాడు యువసాధకుడు. అందులకు జనక మహారాజు చిరునగవుతో "చిత్తము, మీ అభీష్ట ప్రకారమే కానీయండి" అన్నాడు.

వారిరువురు అడవిలోనికి బయలుదేరుతుండగా రథ మొకటి వచ్చి రాజుగారి ప్రక్కన ఆగినది. వెంటనే మన యువసాధకుడు "వద్దు వద్దు, రథము వద్దు. మనము నడువబోవునది రాచబాట కాదు, రాళ్ళబాట సుమండీ" అన్నాడు. రాజు సరే అని సమ్మతించాడు. రథముండుట, లేకుండుట అనునవి రాజుగారి కొకటియే కాని విభిన్నము కాదు. ఇరువురు నడక ప్రారంభించారు. కానలలో కోనలలో ప్రయాణించారు. మూడు దినముల పాటు విశ్రాంతి నీయక రాత్రింబవళ్ళు రాజుగారిని నడిపించాడు సాధకుడు. మూడవనాడు "మహారాజా! మీకేమైనా బాధగా యున్నదా" అని ప్రశ్నించాడు- అష్టావక్రుడు. ఈ ప్రశ్న ద్వారా ఆ సాధకులుంగారికి బాధగా యున్నదనెడి విషయము విదితమైనది మహారాజుగారికి. మనకు వ్యథలు, వేదన లున్నచో ఇతరుల బాధలను పట్టించు కుందుము గదా! "నాయనా! నీకు కాళ్ళనొప్పు లెక్కువైనట్లు

తెలియుచున్నది; కనుక (నీకొరకై) ఒకింత విశ్రమించుదా” మని సూచించాడు జనక మహారాజు. లోలోన అమ్మయ్య అనుకొని, అందుల కంగీకరించినట్లుగా మరుక్షణమే కూర్చొని, మహారాజును కూడా కూర్చుండమని సాధకుడు కనుసైగ చేశాడు. “నాయనా! కాళ్ళు నొప్పి నీకేకాని నాకు కాదని నీవు అంగీకరించితే నేను కూర్చుంటాను” అని జనకుడు తెలిపాడు. సాధకుడు సమ్మతి పూర్వకముగా తల నాడించాడు.

ఒకింతసేపు విశ్రాంతి పొందిన పిదప, మరల యిరువురు నడక సాగించారు. కొండలలో మిట్టలలో గుట్టలలో రెండు రోజులు నడిచారు. అంతట యువ సాధకుడు జనకుడిని “మహారాజా! మీకు దప్పిక వేయు చున్నదా?” అని ప్రశ్నించాడు. “నాయనా! నీకు దప్పిక వేసి తప్పటడుగులు వేయుచున్నావని తెలుపకనే తెలియు చున్నది. మీరు దయచేసి యిక్కడ విశ్రమించండి. నేను నీరు తెచ్చెదను. దాహము మీకే కాని నాకు కాదని మీరంగీకరించెదరని తలచెద” నన్నాడు మహారాజు. ఆమోద పూర్వకముగా తలనూపాడు అష్టావక్రుడు. ఆ

తరువాత దాహోపశమనము కాగా మరల యిరువురు పయనము సాగించారు.

ఈ విధముగా ఆరు దినములు ప్రయాణించారు. ఆరవ రోజు తరువాత అష్టావక్రునకు ఆకలి బాధ కలిగినది. లోలోన ప్రేగులు మూలుగుచున్నవి; చుట్టుకు పోతున్నవి. మరి ఆరు దినము లాహారమేమియూ లేదు కదా! పండ్లు బిగపట్టి కడుపు నొక్కుకుంటున్నాడు సాధకుడు. వాని పరిస్థితిని జనకుడు గమనించాడు కానీ తెలియనట్లే నటించాడు. క్షుద్బాధలో లోపల సుడుగులు తిరుగుతున్నది. "మహారాజా! మీకేమీ ఆకలిగా లేదా" అని నీరసముగా ప్రశ్నించాడు సాధకుడు. "మీకు ఆకలి వేయు చున్నట్లు అర్థమగుచున్నది. మీ కాహారము పెట్టుట రాజుగా నా కర్తవ్యము. మీ రిక్కడనే యుండండి; మీ కాహారము తెచ్చెద" నన్నాడు మహారాజు. చెప్పినట్లుగనే మహారాజు ఫలములను సేకరించి సాధకున కిచ్చాడు. "ఆకలితో అలమటించినది తనే" అని సాధకుడు చెప్పి ఒప్పుకున్న తరువాతనే మహారాజు ఫలములను స్వీకరించాడు.

వారము దినముల తరువాత సాధకునకు నిద్ర ముంచుకొని వచ్చినది. కునుకు తీయక తప్పదనెంచి, "మీకు నిద్రపోవాలని లేదా" అని ప్రశ్నించాడు. "మీకు ఒడలి బడలికతో నిద్ర ముంచుకు వచ్చుచున్నదని గమనించితిని. మీకే నిద్ర వచ్చు చున్నదని, నాకు కాదు అని అంగీకరించితే మీరు కోరినట్లుగా నిద్రించుతానని" బదులు పలికాడు మహారాజు. నిద్ర కన్నులతోనే తల ఆడించాడు సాధకుడు. అటుపై వారిరువురు కొంతసేపు నిద్రించారు.

నిద్ర నుండి మేల్కాంచినంతనే మహారాజు హంస తూలికా తల్పముపై పరుండినట్లు, కొందరు సుందరులు వారికి నిద్రాభంగము కలుగనీయక మెలమెల్లగా వింజా మరలు వీచుచున్నారని సాధకుడు గ్రహించెను. తను మాత్రము నేలపైననే పరుండినట్లు గమనించెను. అంతట "మహారాజా! మీరు నేలమీద పవ్వళించలేదు; ఓడి పోయినా" రన్నాడు సాధకుడు. మహారాజుకు వింజా మరలు వీచుచూ సేవ చేయుచున్న వారు దేవతా సుందరులు. వారలా మాటలకు కలుగచేసుకొని సాధకునితో

"ఓయీ, ఏమిటీ అధిక ప్రసంగము? వారము దినముల పాటు ఈ మహారాజుతో మర్యాద నతిక్రమించి ప్రవర్తించు చున్నావు. నీకింకనూ బుద్ధి కలుగలేదు; వెలుగ లేదేమయ్యా? దేవతలమైన మేమీ భూపతిని గౌరవించు తున్నాము. నిద్రాహారములు, విశ్రాంతి లేకుండునట్లు వారము దినములు వీరిని వేధించి యున్నావు. ఏనాడు వారు వాటిని గురించి పలువరించలేదు సరికదా, తలచనే తలచలేదు గదా! వారు కటిక నేలమీదనే కాదు మంచు గడ్డపై సైతము పడుకొనగలరు. ఈ వారపు దినములలో వారి సాన్నిధ్యములో మెలగిన నీకు వారెట్టి మహాత్ములో గమనించుట కవకాశ మున్నది కదా! కానీ నీవు గమనించ జాలక పోయితివి గదా! ఆ దివ్యాత్ముడు కటిక నేలపై పరుండట చూచి భరించలేకనే సముచితమైన ఈ చక్కని సదుపాయములను మేమే ఏర్పరిచాము. నీవు ఆచరణ లేని ఆధ్యాత్మిక సాధకుడవు. కానీ భూపతి త్రికరణాత్మకముగా యోగస్థుడైన వాడు, కనుక శ్రేష్ఠుడు. నీవు వారము దినములు వృథా పరిచినావు కదటయ్యా! ఇక చాలు! నీవు ఆచరించని ఆధ్యాత్మిక సూత్రములతో వాగ్వాదము

చేయకు. అనవరతము కర్తవ్య నిర్వహణలో నున్న వానిని భంగపరుచు కంచర గాడిదవు నీవు" అని అన్నారు. విషయము విదితమైనది కదా!

ఒకరీ గదిలో ముఖ్యమైన పనిలో నిమగ్నులై యున్నారనుకొనుడు. చక్కగా గాలి ప్రసరించనందున ఒక కిటికీ తలుపు తెరచి మరల అతను పనిలో నిమగ్నుడైనాడు. ఆకస్మాత్తుగా ఒక గాడిద ఓండ్ర పెట్టుట నారంభించినది; ఫలితముగా వాని పనికి భంగమైనది. ఆధ్యాత్మిక వాదములు ఈ గాడిద ఓండ్రింపుల లాంటివి.

తనలోని లోపము తెలిసిన యువసాధకునకు కన్ను తెరచి వెన్ను తట్టినట్లయినది. శుష్క తత్త్వ విచారణము, వృథా వాదముల నాపి, ఆధ్యాత్మికత నాచరించుటకు బయలుదేరినాడు. మహాత్ముల ప్రవర్తన నుండి మన మీ విధముగా బోధనలను నేర్చుకోవలయును.

కనుక కావలసిన దానికై తెలివితేట లుపయోగించి "మహాత్మా! మీకు ఆకలి వేయుట లేదా? దప్పిక లేదా? చలిగా లేదా?" అని ప్రశ్నలు వేయుట కద్దు. వారు

చిరునగవును చిందించుచూ, మనలను వెలుగువైపుకు త్రిప్పుదురు. వారల ఏకైక లక్ష్యము మానవులను వెలుగు వైపు త్రిప్పుటయే! ఈ విధానములో మనమనేక ప్రశ్న లడుగుట కద్దు. ప్రతిగా వారు మనలను ప్రకాశోన్ముఖులుగా చేయుదురు.

ఇదిగో, ఇదే శ్వేత పద్మ మొనరించు శ్రేష్ఠ కార్యము. సదా అది వెలుగు వైపునకే తిరిగి యుండును. కనుకనే అది వెలుగు బాట చూపు ప్రకాశాత్మ.

**"నా వలె మీరు సైతము వెలుగువైపు తిరగండి. మీ రెంతగా వెలుగువైపు చూపులు మరలింతురో అంతగా మీరితర విషయములను విడిచి పెట్టుదురు"** అని శ్వేత పద్మ ముద్ఘాటించు తున్నది.

వేదనల కతీతముగా జీవితమును గడుపుట యెట్లో ఒక మనీషి రెండువేల సంవత్సరముల క్రితము ప్రదర్శించి నాడు. సూది మొన చురుక్కునే మనము భరించలేము, కానీ ఆ మహాత్ముడిని సజీవముగా శిలువ నెక్కించి, మేకులు కొట్టారు. కానీ ఆయన దుఃఖించలేదు సరిగదా

ఎవరినీ దూషించలేదు! వానికి మనకు మధ్యనున్న వ్యత్యాసమేమిటి? మనకు కించిత్ బాధ కలిగినచో భరించ జాలము. బాధ ఎక్కడ కలుగునో అని బహుదూరముగా నుందుము. అనగా మనము బాధపట్ల ఎఱుక కలిగి యున్నాము. వెరపు కలిగి యున్నాము. కానీ ఆయనయో? దాని కతీతముగా నున్నాడు. స్వర్గధామ మందున్న వెలుగుల మూర్తియైన తండ్రి పట్లనే ఉన్ముఖుడై యున్నాడు. అట్లుండుటయే వాని ఏకైక దీక్ష. వేరొక పని లేదు. చిలువలు, పలువలు లేవు. పద్మమునకు ఒకే ఒక నాళ మున్నది. దానికి కొమ్మలు, రెమ్మలు లేవు. గమనించితిరా?

పద్మమునకు నాళముండినట్లే మనిషికి వెన్నెముక యున్నది. నాళముపై పద్మము వికసించు విధముగా, వెన్నెముకపై తల యున్నది. సగటు మానవుని తలలోని పద్మము పసరు మొగ్గగనే యున్నది. వికసించలేదు. జ్ఞాని శిరోభాగములో ఈ పద్మము వికసితమై యుండును. ఈ దృష్ట్యా సగటు మానవు లందరూ పసరు మొగ్గలు. జ్ఞానులు సంపూర్ణ వికసిత పద్మములు.

పద్మనాళములో అనేక తంతువు లుండును. అట్లే మానవుని వెన్నెముకలో కూడా! వెన్నెముకలోని తంతువు లను (దారములను) నాడులని అందురు. అవి ప్రజ్ఞా మయములైన తంతువులు. ఇట్టి తంతువుల లేక నాడులలో ముఖ్యమైనది సుషుమ్న. సుషుమ్న నాడి ఆధారముగా మానవునిలో అనేక పద్మములు విప్పారును. మనలోని శక్తి చాలక కేంద్రములు లేక చక్రములు (centres of forces) నుండి వికసిత పద్మముల వరకూ మన మభివృద్ధి పొంద గలము. చక్రములు– శక్తి యొక్క సుడిగుండములు. అందు ప్రవేశించిన వారిని అవి బంధించును. కనుక చక్రములు బంధకారకములు. పద్మములు శక్తి, ప్రజ్ఞ వికసమునకు సూచకములు. వెలుగుపట్ల ఏమరుపాటు లేని యెఱుక కలిగి యున్నచో మానవుడు క్రమక్రమముగా వికసించును.

జ్ఞాన రహస్య మంతయూ పద్మము యొక్క నాళములో నిమిడి యున్నది. కనుక అది తన తల అనెడి పద్మమును వికసింప చేయగలుగు తున్నది.

మనలో నూట ఎనిమిది దళములు గల పద్మము భ్రూమధ్య కేంద్రము నందు, వేయి దళములతో వెలుగొందుచున్న పద్మము శిరస్సు నందు కలవని మన అందరికీ తెలిసిన విషయము. కాని యివి ఎందులకు అందరిలో వికసించ లేదు? కారణము– మన వెన్నెముకలో పనిచేయుచున్న శక్తుల కనుకూలముగా మనము జీవించుట లేదు– కనుక అవి యింకనూ వికసించలేదు.

మనలోని వెన్నెముక వెలుగుబాట అని దర్శించక, మన భౌతిక శరీరమును నిలబెట్టుటకు కేవలమది ఒక వెదురు గొట్టముగా దానిని భావించు చున్నాము. ఇంతకు మించిన ప్రయోజనము వెన్నెముకకు కలదని మనము గమనించలేదు. అది మన (శరీరమనే) గృహమునకు మూలస్తంభము. మన కారుకు ఛాసిస్ (Chasis) లాంటిది. అందులో అనేకానేక రహస్యములు, శక్తులు, ప్రజ్ఞలు నిక్షిప్తములై యున్నవి.

నీటి నుండి కాండముతో సహా ఈవలకు పెరుక వేయబడిన పద్మమును మీరు చూచుట తటస్థించినచో, దయ చేసి ఆ కాండము (నాళమును) పదిలముగా తెరచి

పరిశీలించండి. పరిశీలించవలయును కదా అని పని కట్టుకొని నీటిలోని పద్మమును బయటకు పెరుక వద్దు. ఇదివరకే పెరకబడియున్న పద్మమును మీరు చూచినచో అంతట దాని నాళమును మెల మెల్లగా జాగ్రత్తగా తెరచి అందెన్ని తంతువులున్నవో గమనించండి. సుకుమారము లైన అనేక తంతువు లున్నట్లు గమనించ గలరు. అందులో మరీ మన కంటికి కనిపించని సుకుమారమైన తంతువు లుండును. ఎంత విచిత్రము! ఈ సన్నని నాళములో ఎన్ని విన్నాణములైన తంతువు లిమడ్చబడి యున్నవి.

అదే విధముగా మన వెన్నెముకలో సూక్ష్మాతి సూక్ష్మములైన నాడు లనేక మున్నవి. ఇవి అన్నియూ పద్మము వికసించుటకు తోడ్పడుచుండును. పద్మమును చూచినంతనే మన వెన్నెముక, అందు నిక్షిప్తములై యున్న శక్తులు, అవి వికసన మగుటకు, వెలుగుటకు, పరిసరము లను వెలిగించుటకు, తగు అవకాశము- ఇత్యాదు లన్నియూ మనలో వెను వెంటనే స్ఫురించవలయును.

ఒక్క విషయములో వినా మనకు, పద్మమునకు

మధ్య వ్యత్యాసము లేదు. అది- పద్మము పరిపూర్ణముగా వికసించి యుండును. మనమింకనూ వికసించవలసి యున్నది. అనేక విషయములలో మనము పద్మమువలె వికసించవలసి యున్నది. అవి మీ కిదివరకే వివరించ బడినవి. ఆ గుణము లన్నియు మనలో మేల్కొనినప్పుడు, పరిపూర్ణ వికసనము జరుగుటకు వీలు కలుగును. స్థిరత్వము, కోమలత్వము, పవిత్రత్వము- ఇత్యాది సల్లక్షణము లప్పుడు సంప్రాప్తించును. ఈ కారణము వలననే ప్రపంచ పురాణేతిహాసాదులలో పద్మమొక చక్కని సంకేతముగా సంభావింపబడినది.

పద్మమునకు తదితర పుష్పములకు మధ్య ఒక ప్రత్యేక వ్యత్యాస మున్నది. ఇతరములైన పూవులవలె పద్మములో వికసించెడి పొర ఒకటే యుండదు. దానిలో అనేక దళము లనబడెడి పొరలు వికసించును. దళముల కేంద్రము కనిపించెడి పర్యంతమది వికసించును. దాని కెన్ని దళము లున్నవో అంత అందముగా అది కనిపించును, మురిపించును. పద్మములోని అందమైన దళములొక సందేశమును ప్రసారించు చున్నది. మనము

కూడ వెలుగును అన్ని ప్రక్రియలలో ప్రసరింప చేయ వచ్చునని ప్రబోధించు చున్నవి.

మానవులుగ మన కనేకమైన పనులున్నవి. దళములే లేనిచో పద్మమున కందమెక్కడిది? శోభ ఎక్కడిది? అసలు దళములు లేని పద్మమును మన మూహించగలమా? మనకు గల ఆధ్యాత్మికత దైనందిన జీవనములోనికి వ్యాపించనిచో, అది అనుభవములోని కెట్లు వచ్చును?

పద్మము మనకొక కమనీయ గుణపాఠమును నేర్పు తున్నది. అదేమనగా - ప్రతి పనిలో మన వెలుగును ప్రసరింపచేసి, ప్రదర్శించ గలగాలి. అట్టి వెలుగుతో వెలు గొందు ప్రతి కార్యము లలిత లావణ్యభరితమైన పద్మ దళమే! పద్మములో కోమలదళము లనేక పొరలు పొరలలో నుండును. మొదటగా క్రింద దళములు, దానిపై దళములు, వాటిపై మరల దళము లుండును. ఈ దళము లన్నియు వికసించి, దరహసించుట అనగా అన్ని కక్ష్యలలో వికసనము జరిగినదన్నమాట. సమగ్ర ఆధ్యాత్మిక ప్రక్రియ, తదవసర గుణగణములను- సంపూర్ణ వికసిత పద్మ ముపదేశించు చున్నది. ఇదిగో- ఈ కారణము వలననే

ఆధ్యాత్మిక శక్తిని స్ఫూర్తివంతముగా వివరించుటకు పద్మములనే ఉదహరింతురు, ఉద్ఘాటింతురు.

మహాద్రష్టలైన ఋషులు ఈ విశ్వము నంతటిని సంపూర్ణ వికసిత పద్మములతో నిండిన సువిశాల తటాకముగా దర్శింతురు. ఈ సువిశాల తటాకములోని విస్ఫారిత పద్మములే సూర్య కుటుంబములు. సౌర కుటుంబము లనగా వెలుగుగా వికసించిన గ్రహముల సముదాయములు. ఇందలి ప్రతి సౌరకుటుంబము సురుచిరమై లయబద్ధముగా క్రమశః వికసించినవే. విశ్వకక్ష్య నుండి ఈ విశాల తటాకమును వీక్షించినప్పుడు అనేకానేక పద్మములు వికసించు చున్నట్లుగా, అనేక సౌర కుటుంబములు వికసించుచు విప్పారుచున్నట్లు కనిపించును (ఎంతటి కమనీయ దృశ్యమిది!).

విశాల నీల తటాకములో పద్మము లనేకము పుష్పించు చున్నవి. ఆ విశాల నీల తటాకమే వినీల గగనము. ఆ నీల గగనములో శ్వేతపద్మములవలె అసంఖ్యాకమైన సౌర కుటుంబములు పుట్టి క్రమశః వికసించుచూ, విస్ఫారితములగు చున్నవి. ద్రష్టలైన

మహర్షులు విశ్వమును అందలి వివిధ సౌరకుటుంబముల నీ చందముగా సందర్శించినారు.

మనలో నున్న పద్మమునే మనము చూడజాలక పోతున్నాము. కానీ మహర్షులు అనేకానేక వికసిత పద్మములతో విలసిల్లుతున్న వినీలాకాశ మనెడి తటాక మును గాంచగలరు. ఒక్కసారి దృష్టి మరలించి, సువిశాల గగనములో నెన్నెన్ని పద్మములు వికసించుచున్నవో వీక్షించండి. ఆకాశములో తారలుగా వెలుగొందుచున్నవి సంపూర్ణముగా వికసించిన శ్వేత పద్మములే. ఆకాశ మందలి తారలను మనము లెక్కించ గలమా? అవి లెక్కకు మిక్కిలిగా నున్నవి గదా!

మన చూపున కందనివి, సునిశితబుద్ధికి సైత మతీతమైన వ్యూహము (systems) లెన్నో యున్నవి. ఉదాహరణకు మన దృష్టి ప్రజ్ఞకు మహర్షుల దర్శన ప్రజ్ఞ కెంత వ్యత్యాసమున్నదో గదా! అందుకనే మహర్షులు ఈ సమస్త సృష్టిని సుందర పద్మములతో అంద అందముగా వెలుగొందుతున్న తెలతెల్లని పద్మముల కోనేరుగా అభివర్ణించి యున్నారు. సంస్కృతములో దానిని “పద్మాలయ”

మని అందురు. అనగా పద్మములకు నివాస స్థానము (ఆలయము). కనుక పద్మాలయ మనగా అసంఖ్యాక సౌర కుటుంబము లనెడి పద్మములతో భాసించుచున్న ఆకాశము.

శ్రీమాతను (లలితను) 'పద్మినీ' అని స్తుతించుట కద్దు. అస్థిత్వము (ఉనికి existence) ప్రజ్ఞాధారభూత మగు చున్నది. కనుకనే వికసనాత్మమగు ప్రజ్ఞ జగన్మాతగా కీర్తింపబడినది. సునిశ్చల వినీలాకాశము - తండ్రి. (ఆకాశ మనగా అవకాశము కలది; ప్రకాశ మయమైనది అనెడి అర్థములు కలవు). అది నేపథ్యముగా (Back ground) అనేక సౌరవ్యూహములుగా వెలుగు వెలువడు తున్నది. దీనిని "మాత" అని అందురు. కనుక సకల సృష్టి, అందలి సౌరవ్యూహములు వికసించుట - జగన్మాత చేయు కార్యము. దీనికి పూర్వ రంగముగా నున్నది- జగత్పిత. జగన్మాత ఆలన పాలనలో ఈ వికసన ప్రక్రియ జరుగుతున్నది. దీనికి సూచ్యార్థముగా చేతిలో పద్మము కలదిగా ఆమె అర్చింపబడుతున్నది. (కనుక ఆమెను 'పద్మపాణి', 'పద్మహస్త' అని స్తుతించుట కద్దు.) ప్రజ్ఞగా

వికసించుచున్నది ఆమె. అటుపై వినీలాకాశ మనబడెడి పూర్వరంగముపై శాశ్వత వికసనత్వమూ ఆమెయే.

ఒక (సౌర) వ్యూహము తరువాత మరొక వ్యూహము క్రమశః వికసించును. నియమిత కాలము వరకు అవి వెలుగొందును. ఆ నియమిత కాలము ముగియగనే ఒక పద్మము ముకుళించుకొని పోవును. వేరొక పద్మము వికసించుట ప్రారంభించును. తామరతంపరగా అనేక పద్మములుగల కోనేరును చూచినచో, వేర్వేరు స్థితులలో నున్న పద్మములు కనిపించును. అందు కొన్ని పసరు మొగ్గలు, కొన్ని మొగ్గలు, మరికొన్ని క్రమశః వికసనము చెందుతున్నవి, మరికొన్ని పూర్తిగా వికసించినవి- ఇట్లు పలురకములుగా నుండును. ఆకాశములో కనిపించెడి సప్తర్షి మండలము సంపూర్ణ వికసిత పద్మముల గుచ్ఛము. మన సౌరకుటుంబమో- అది ఒక మొగ్గ. క్రమక్రమముగా వికసించు ప్రక్రియలో నున్నది.

మన మెంతయో శక్తిని, కాలమును వ్యయ మొనర్చు చున్నాము. ఎందులకింత వ్యయ మనగా- వికసించుటకు అని సమాధానము వచ్చును. ఈ వికసన ప్రక్రియ

జరుగుతునే యుండును. పద్మము పట్ల ఇట్టి సద్భావము లున్నచో, ప్రజ్ఞా వికసనము కలుగును. కనుక మనము పద్మమును గూర్చి ధ్యానము చేసినచో– హృదయ కేంద్రము నందు, విశుద్ధి కేంద్రము నందు, భ్రూమధ్యము నందు, శిరస్సు నందు గల పద్మములు వికసించును. ఈ నాలుగు పద్మములను కేవలము ఐదు క్షణములలో నుచ్చరించాము; కానీ సదా శ్రద్ధా దీక్షలతో ఆధ్యాత్మిక సాధన చేసినచో, అవి వికసించుటకు ఐదు దశాబ్దములు పట్టును.

"అంత ఆలస్యమా" అని వెత చెందరాదు; వేగిరపడ నక్కర లేదు. వికసనమును క్రమక్రమముగా జరుగ నిచ్చుదము గాక! అప్పుడు ప్రతి వికసనములోని అంద చందములను, ఆనందమును మన మనుభవించగలము. వికసనమునకై త్వరపడుట, విసవిసలు, రుసరుసలాడుట యుండకూడదు. ఒక్కొక్క వికసనము జరుగుచుండగా ఎంతటి హాయి, తృప్తి కలుగునో వాటిని మనము చక్కగా ననుభవించగలము. ఇది అనుభవాత్మకమైన ప్రయాణము. దాని వలన ఆనందము, తృప్తి కలుగును; వెలుగును.

పద్మములలో శ్వేత పద్మములని, నీల పద్మములని వివిధ వర్ణములు గల పద్మము లున్నవి. గుప్తవిద్య (Secret Doctrine) అను గ్రంథము నంతటినీ పద్మమును సంకేతముగా, ఆధారముగా తీసుకొని చక్కగా వివరించ వచ్చును (ఇదొక రహస్యము!). గుప్తవిద్య అనెడి పేరుతో బృహత్తర గ్రంథము నిచ్చినది- మేడమ్ హెలీనా పెట్రోవా బ్లావెట్స్కీ. ఆదరాభిమాన పూర్వకముగా, ఆమె శ్వేత పద్మముగా సంబోధించబడినది. మానవుడు పద్మముగా మారినప్పుడే లేక పద్మముగా పరిణామము చెందినప్పుడే విశ్వము లేక బ్రహ్మాండమనెడి పద్మమును గూర్చి చెప్పుటకు చేవ కలుగును. పై చెప్పబడిన గ్రంథములో నామె బ్రహ్మాండోత్పత్తి, పిండాండోత్పత్తిని గూర్చి చక్కని వ్యాఖ్యానము వ్రాసినది. దానికి కారణ మామె శ్వేతపద్మముగా మారినది కనుకనే! ఈ భూగ్రహములోని వేవేల జీవులలో గత శతాబ్దపు కాలములో ప్రజ్ఞావికసనము కలిగించి, వెలిగించిన ఆమె నిశ్చయముగా శ్వేత పద్మమే!

కనుక సాయన సంవత్సరములోని మే నెల 9వ

తేదీని "శ్వేతపద్మ దినము" (White Lotus Day)గా సంభావింపబడు తున్నది. ఆ దినముననే ఆమె భౌతిక దేహమును పరిత్యజించినది. శరీరమునే పరిత్యజించినది కానీ మానవాళిని పరిత్యజించ లేదు. చాలామంది చనిపోవుట కద్దు. కానీ కొందరు మాత్రమే శరీరమును వదులుదురు. (ఈ రెండింటికీ మధ్య గణనీయమైన వ్యత్యాస మున్నదని గమనించ వలసినది.) దేహ త్యాగము చేసిన వారిలో మహత్తరమైన ఉదాహరణ మామె. ఆమె విగత జీవురాలైనది, కానీ కొందరికింకనూ ఆమె వివాదగ్రస్త వ్యక్తిగానే మిగిలినది. ఆమె వెలిగించి, కలిగించిన ప్రేరణ, ఉద్దీపనముల ద్వారా భూగ్రహ మందంతటిలో జ్ఞాన ప్రసరణ మగుచునే యున్నది.

స్థిరత్వములో ఆమె పర్వతమే! జ్ఞానవికసనములో ఆమె ఒక మహాపద్మము. ఆమె సంపూర్ణముగా వికసన మగునంత వరకు, వికసనము కలిగించునంత వరకూ, ఆమె జర్జరీభూతమైన శరీరములో నున్నది. అటుపై శరీరమును వదలి, ఉన్నత కక్ష్యలలో నుండ నిశ్చయించి నది. ఆమె తన భౌతికతను వదలిన దినము శ్వేతపద్మ

దినముగా (White Lotus Day) ప్రపంచమందంత సంభావించ బడుతున్నది; సమాదరించ బడుతున్నది.

మీరు పద్మమును గురించి ఆలోచించినచో మేడమ్ హెచ్.పి. బ్లావెట్స్కీ స్ఫురించక తప్పదు. ఆమె స్ఫురించి నంతనే మీలో నొక శక్తి కలుగును, వెలుగును. అది ఆగ్నేయమైన శక్తి (Fiery force). ఆ ఆగ్నేయ శక్తి తమసత్వము (Inertia)ను బ్రద్దలు చేయును. అది భౌతికతను చిద్రుపలు చిద్రుపలుగా చేయును. చిచ్ఛక్తిని వెలిగించును. **H.P.B.** అనెడి మూడు అక్షరములలో అది నిమిడి యున్నది.

ఆ మహనీయ వ్యక్తి సదా మన స్మృతిపథములో మెలగు గాక! వెలుగు గాక! ఈ సాయం సమయ ప్రసంగము, సహజీవనమును హెలీనా పెట్రోవా బ్లావెట్స్కీ అనెడి పేరుతో వెలుగొందిన పవిత్రాత్మకు అంకితము చేయుదుము గాక! మన ప్రసంగములను, ప్రవచనముల నామె కంకిత మొనర్చుటకంటె, మన జీవితమును, జీవిత కార్యక్రమములను ఆమె ఆచరించినట్లు ఆచరించి, అంకిత

మొనర్చినచో ఆమె మరింత ఆనందించును; హర్షించును. కనుక మనమా విధముగా జీవించుటకు ప్రారంభించుదుము గాక!

వికసిత శ్వేతపద్మ ప్రజ్ఞకు సంకేతముగా, చిరస్మరణీయురాలైన మేడమ్ బ్లావెట్స్కీ గారికి ఈ ప్రసంగమును సమర్పించుదుము గాక! ఇదంతయూ ఆమె యెక్కడనో వివరించినదని భావించకండి. శ్వేత పద్మమైన ఆమెను సంభావించినంత మాత్రముననే వివరణాత్మకమైన ప్రసంగము, వికసనము కలుగును.

HPB అనగా అదీ!

శ్వేతపద్మ ప్రజ్ఞ అనగా అదీ!

*మీ అందరికీ నా ధన్యవాదములు!*

స్వస్తి.

## మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | అమనస్కుడు | 30-00 |
| 2. | అన్వేషకుడు | 100-00 |
| 3. | అసంగుడు | 25-00 |
| 4. | అంబరీషుడు | 80-00 |
| 5. | హెచ్.పి.బి. ఆత్మసాధనా సూత్రములు | 50-00 |
| 6. | శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు | 100-00 |
| 7. | శ్రీగురుపాదుకాస్తవము | 50-00 |
| 8. | శ్రీలలిత (10 భాగములు) | 750-00 |
| 9. | సాయి సూక్తులు | 80-00 |
| 10. | సంఘనీతి | 120-00 |
| 11. | శ్రీదత్తాత్రేయ | 40-00 |
| 12. | ధర్మవిగ్రహుడు - శ్రీరాముడు | 35-00 |
| 13. | రుక్మిణీ కళ్యాణము | 100-00 |
| 14. | మరణరహస్యం-1 (మార్కండేయుడు) | 80-00 |
| 15. | మరణరహస్యం-2 (సతీసావిత్రీదేవి) | 100-00 |
| 16. | కుమార సంభవం | 70-00 |
| 17. | భాగవతమూర్తి భీష్ముడు | 100-00 |
| 18. | కథాదీపిక | 40-00 |


ప్రతులకు : **ధనిష్ఠ పబ్లికేషన్స్**, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
e-mail : www.dhanistha.org. info@dhanistha.org.

## ధనిష్ఠ ప్రచురణలు

















**ప్రతులకు :** ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

విశాల నీల తటాకములో పద్మము లనేకము పుష్పించు చున్నవి. ఆ విశాల నీల తటాకమే వినీల గగనము. ఆ నీల గగనములో శ్వేతపద్మములవలె అసంఖ్యాకమైన సౌర కుటుంబములు పుట్టి క్రమశః వికసించుచూ, విస్ఫారితములగు చున్నవి. ద్రష్టలైన మహర్షులు విశ్వమును అందలి వివిధ సౌరకుటుంబ ముల నీ చందముగా సందర్శించినారు.

మనలో నున్న పద్మమునే మనము చూడజాలక పోతున్నాము. కానీ మహర్షులు అనేకానేక వికసిత పద్మములతో విలసిల్లుతున్న వినీలాకాశ మనెడి తటాక మును గాంచగలరు. ఒక్కసారి దృష్టి మరలించి, సువిశాల గగనములో నెన్నెన్ని పద్మములు వికసించు చున్నవో వీక్షించండి. ఆకాశములో తారలుగా వెలుగొందుచున్నవి సంపూర్ణముగా వికసించిన శ్వేత పద్మములే. ఆకాశ మందలి తారలను మనము లెక్కించ గలమా? అవి లెక్కకు మిక్కిలిగా నున్నవి గదా!

ధనిష్ఠ

ISBN 978-81-89467-84-5
9 788189 467845